సాక్షి అనకాపల్లి

ఆదివారం । 19 । నవంబర్ । 2023



శ్రీవారి దర్శనానికి..

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.



బిగ్ స్క్రీన్‌పై బిగ్ ఫైట్

విశాఖ స్పోర్ట్స్: క్రికెట్ ప్రపంచ కప్ ఫైనల్స్ వీక్షించేందుకు ఆదివారం ఆర్కే బీచ్‌లో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ బిగ్ స్క్రీన్ ఏర్పాటు చేసింది.



వీకెండ్ సందడి

సాక్షి,పాడేరు: వంజంగి హిల్స్‌లో శనివారం పర్యాటకులు సందడి చేశారు.వీకెండ్ కావడంతో భారీగా తరలివచ్చారు.

న్యూస్‌రీల్

పారదర్శకంగా టీ-20 టికెట్ల విక్రయం



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్ రెడ్డి

విశాఖ స్పోర్ట్స్: భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య ఈ నెల 23న జరిగే టీ-20 మ్యాచ్ టికెట్లను పారదర్శకంగా విక్రయించినట్లు ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు గానూ ఈ నెల 15, 16 తేదీల్లో ఆన్‌లైన్‌లో టికెట్లు విక్రయించినట్లు చెప్పారు. ఈ నెల 17, 18 తేదీల్లో పీఎంపాలెంలోని డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియం బీ గ్రౌండ్, వన్‌టౌన్‌లోని ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం, గాజువాకలోని రాజీవ్ గాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని కౌంటర్లలో కనీస ధర రూ.600 నుంచి గరిష్ట ధర రూ.6000లో పాటు రూ.1500, రూ.2000, రూ.3000, రూ.3500 టికెట్లను ఆఫ్‌లైన్‌లో విక్రయించినట్లు వెల్లడించారు. ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకున్న వారు.. స్టేడియంలో ప్రవేశానికి గానూ ఫిజికల్ టికెట్లుగా మార్చుకునేందుకు ఈ కౌంటర్లలో 22వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. మ్యాచ్ జరిగే రోజు కూడా స్టేడియంలో టికెట్లను మార్చుకోవచ్చని వెల్లడించారు.

జీపీఎఫ్ రుణాలు సకాలంలో మంజూరు చేయాలి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

విశాఖ విద్య: ఉపాధ్యాయులకు జీపీఎఫ్ రుణాలను సకాలంలో మంజూరు చేసేలా తగిన చొరవ తీసుకోవాలని జెడ్పీ సీఈవో పోలినాయుడుకు పీఆర్‌టీయూ ఉమ్మడి విశాఖ జిల్లా కన్వీనర్ గోపీనాథ్ కోరారు. శనివారం జెడ్పీ సీఈవోను కలసి ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల నేపథ్యంలో జీపీఎఫ్ ఖాతాలను అప్‌డేట్ చేయాలన్నారు. సాంకేతిక సమస్యలతో కొంతమంది ఉపాధ్యాయుల పీఎఫ్ ఖాతాల్లో వేతనాల నుంచి మినహాయించిన నగదు జమ కావటం లేదన్నారు. దీనిపై చొరవ తీసుకొని ఉపాధ్యాయులకు మేలు చేసేలా తగిన చర్యలు చేపట్టాలన్నారు.అదే విధంగా పీఎఫ్ స్లిప్పులు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఈ మేరకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

తలకెక్కిన అభిమానం



అనకాపల్లి టౌన్: భారత్-ఆస్ట్రేలియాల మధ్య జరగనున్న క్రికెట్ ఫైనల్స్‌లో మన దేశం విజయం సాధించాలని దేశమంతా ఉత్కంఠగా ఎదురు చూస్తున్న వేళ.. అనకాపల్లిలో ఓ వ్యక్తి వినూత్నంగా తన అభిమానం చాటుకున్నాడు. భారత్ మూడోసారి ప్రపంచకప్ సొంతం చేసుకోవాలని ఆకాంక్షిస్తూ గవరపాలేనికి చెందిన పెతకంశెట్టి శ్రీనివాసరావు ఇలా తలపై రాయించుకున్నాడు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు గడువు పెంపు

విశాఖ విద్య: సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే టెన్త్, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాలకు గడువు పెంచినట్లు డీఈవో ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 వరకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా తగిన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రూ.200ల ఫైన్‌తో ఈ నెల 30 వరకు అవకాశం ఉందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సమీపంలోని ఓపెన్ స్కూల్ కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

జెడ్పీ అంచనా బడ్జెట్ రూ.1,363.16 కోట్లు



జెడ్పీ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న సభ్యులు



మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

- ఏకగ్రీవంగా ఆమోదించిన సభ్యులు
- పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చ
- ప్రశాంతంగా ముగిసిన సర్వసభ్య సమావేశం

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.1,363.16 కోట్ల అంచనా ఆదాయ బడ్జెట్‌ను సర్వసభ్య సమావేశం ఆమోదించింది. అలాగే రానున్న ఆర్థిక సంవత్సరానికి రూ.1,362.95 కోట్ల వ్యయ బడ్జెట్‌ను ఆమోదిస్తూ తీర్మానించింది. ఇక ప్రస్తుత (2023-24) ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.1,551.06 కోట్ల సవరణ బడ్జెట్‌కు కూడా ఏకగ్రీవంగా ఆమోదాన్ని తెలిపింది. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన శనివారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జెడ్పీ హాలులో జరిగింది. తొలుత గత సర్వసభ్య సమావేశాల్లో సభ్యులు లేవనెత్తిన అంశాలపై తీసుకున్న చర్యలను అధికారులు వివరించారు. పంచాయతీరాజ్ శాఖకు చెందిన 72 పనుల బిల్లుల మొత్తాన్ని పూర్తిగా చెల్లించినట్టు జెడ్పీ సీఈవో పోలినాయుడు సభ్యులకు చెప్పారు. జనరల్ ఫండ్‌కు చెందిన 105 బిల్లులను కూడా క్లియర్ చేశామని, నెల రోజుల్లో సంబంధిత ఖాతాల్లో సొమ్ము జమ అవుతుందని వివరించారు. అనంతరం వ్యవసాయ శాఖపై చర్చ జరిగింది. సెప్టెంబర్ ఆఖరు వరకు అనకాపల్లి జిల్లాలో ఆరు వేలు, విశాఖ జిల్లాలో వెయ్యి ఎకరాల్లోను వరి పంట ఎండిపోయిందని, అల్లూరి జిల్లాలోనూ వరి పంట దెబ్బతిందని, దీంతో ఖరీఫ్ దిగుబడులు తగ్గుతాయని వ్యవసాయ శాఖ అధికారులు చెప్పారు. ఈ పరిస్థితులను ప్రభుత్వానికి నివేదించామన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాను కరువు జాబితాలో చేర్చాలని కోరుతూ తీర్మానించాలని సభ్యులు కోరారు. సభలో ఉన్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో 30-40 శాతం లోటు వర్షపాతం నమోదైందని, అక్టోబర్ ఆఖరు వరకు ఉన్న పంటల పరిస్థితిని ప్రభుత్వానికి నివేదించాలని అధికారులను ఆదేశించారు. కరువు పరిస్థితిపై సభలో తీర్మానం చేయాలని, తాను కూడా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

పీహెచ్‌సీల్లో రోస్టర్ విధానంలో ఉద్యోగ నియామకాలు

గిరిజన ప్రాంతాల్లోని పీహెచ్‌సీల్లో రోస్టర్ విధానంలో ఉద్యోగ నియామకాలు జరపాలని కలెక్టర్‌ను కోరుతున్నట్టు జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర పేర్కొన్నారు. అంగన్‌వాడీ పిల్లలకు సరైన ఆహారాన్ని అందించలేదని ఫిర్యాదు చేసినా పట్టించుకోని అనకాపల్లి జిల్లా ఐసీడీఎస్ పీడీపై చర్యలకు కలెక్టర్‌కు సిఫార్సు చేస్తామని ఆమె చెప్పారు. ఒకరోజే సర్వసభ్య సమావేశం నిర్వహించడంతో అజెండా అంశాలు పూర్తిగా చర్చకు రాకుండా ముగిసిపోతోందని, అందువల్ల రెండు పర్యాయాలు నిర్వహించాలని పరవాడ జెడ్పీటీసీ పైలా సన్యాసిరావు కోరారు. స్పందించిన జెడ్పీ సీఈవో పోలినాయుడు మెజార్టీ సభ్యుల అభిప్రాయాలకనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఏజెన్సీలో కొన్ని మారుమూల గ్రామాలకు విద్యుత్ సదుపాయం కల్పించడానికి అటవీ శాఖ అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని ఆ ప్రాంత సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. ఇందులో తాము నిబంధనలు పాటిస్తున్నామే తప్ప తమ తప్పు లేదని అటవీశాఖ అధికారులు చెప్పారు.

చందనోత్సవం వైఫల్యంపై చర్యలకు సిఫార్సు

ఇటీవల జరిగిన సింహాచలం చందనోత్సవం వైఫల్యం నేపథ్యంలో బాధ్యులపై చర్యలకు సిఫార్సు చేస్తూ ప్రభుత్వానికి నివేదించామని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సభ్యులకు తెలిపారు. ఇకపై చందనోత్సవ టికెట్ల ముద్రణ బాధ్యతను తామే తీసుకుంటామన్నారు. పంచ గ్రామాల్లో ఇళ్ల మరమ్మతులకు ప్రభుత్వం మెమో ఇచ్చిందని, దీనిపై వచ్చే గురువారం నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామని చెప్పారు. ప్రజాప్రతినిధుల ఫోన్లకు అధికారులు స్పందించాలని ఆదేశించారు. అనకాపల్లి సత్యనారాయణపురంలో మంగతాయారు అనే డ్వాక్రా మహిళ బ్యాంకు అధికారులతో కుమ్మక్కై రూ.1.67 కోట్ల సొమ్ము అడ్డదారుల్లో డ్రా చేసిందని, అలాంటి వ్యవహారాలు జిల్లాలో మరికొన్ని చోట్ల జరుగుతున్నాయని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. బాధ్యులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి చర్యలు తీసుకోవాలని, ఇకపై అలాంటి ఘటనలు జరగకుండా చూడాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పటాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. దంతులూరి శ్రీనివాస రాజు, ఎంపీటీసీల మాజీ ఫ్లోర్‌లీడర్ సూరిశెట్టి నాగదుర్గ గోవింద, ఎంపీటీసీ శరగడం నాగేశ్వరరావు, ఎండీ పీపీ రవి, తదితరులు పాల్గొన్నారు.

కోరం లేక 'స్థాయీ' వాయిదా

ఉదయం 9 గంటలకు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం జరగాల్సి ఉంది. అయితే కోరం లేకపోవడంతో అధికారులు దానిని మధ్యాహ్నానికి వాయిదా వేశారు. ఆ సమాచారం తమకు ముందుగా తెలియజేయలేదంటూ కొంతమంది సభ్యులు అధికారుల తీరుపై మండిపడ్డారు. వారిని అధికారులు సముదాయించి సర్దిచెప్పారు. సమావేశంలో వ్యవసాయం, వైద్యారోగ్యం, విద్య, డీఆర్‌డీఏ, పౌరసరఫరాలు, డ్వామా, అటవీ, విద్యుత్, ఆర్అండ్‌బీ తదితర శాఖలపై చర్చించారు. జెడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'గోవాడ సుగర్స్'లో సంబరాలు

- సీఎం చిత్రపటానికి చెరకు రైతులు, ఫ్యాక్టరీ కార్మికుల పాలాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న గోవాడ సుగర్స్ చెరకు రైతులు, కార్మికులు

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతులు, కార్మికుల్లో ఆనందం వెల్లివిరిసింది. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి శనివారం పాలాభిషేకం చేసి వారంతా కృతజ్ఞతలు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పులు పూర్తిగా తీర్చక, ఫ్యాక్టరీ ఆర్థిక పరిస్థితి బాగులేక గత సీజన్‌కు సంబంధించి చెరకు రైతుల బకాయిలు సుమారు రూ.7 కోట్ల 40 లక్షల మేర పేరుకుపోయాయి. కార్మికుల జీతభత్యాలు సుమారు రూ.5 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో అయోమయంలో ఉన్న రైతులు, కార్మికులకు ప్రభుత్వం నేనున్నానని ముందుకొచ్చింది. ఈ బకాయిల కోసం రూ.12 కోట్ల 40 లక్షల నిధులు గ్రాంట్‌గా ఇస్తూ రెండ్రోజుల కిందట ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో చెరకు రైతులు, కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలపాలని నిర్ణయించుకున్నారు. రైతులు, కార్మికులు కలిసి ఫ్యాక్టరీ వద్ద సమావేశమయ్యారు. ఫ్యాక్టరీ ఆవరణలో ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి రైతులు, కార్మికులు కలిసి పాలాభిషేకం చేసి జై జగన్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు కె.వి.వి.భాస్కరరావు, చోడవరం మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ప్రాథమిక సహకార సంఘాల అధ్యక్షుడు శానాపతి సత్యారావు, మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు,

రేపు అచ్యుతాపురంలో సామాజిక సాధికార సభ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

మునగపాక: సామాజిక సాధికారతే లక్ష్యంగా ఈ నెల 20న యలమంచిలి నియోజకవర్గంలో జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రజలకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇంత వరకు జరిగిన సంక్షేమాభివృద్ధిని ప్రజలకు వివరించేందుకు సామాజిక సాధికార బస్సుయాత్రకు శ్రీకారం చుట్టారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో మేలు చేశారన్నారు. బస్సుయాత్ర అనంతరం అచ్యుతాపురంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో మధ్యాహ్నం 3 గంటలకు జరగనున్న బహిరంగ సభకు పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డితోపాటు ఉప ముఖ్యమంత్రులు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి, ఎమ్మెల్యేలు పెట్ల ఉమాశంకర్ గణేష్, గొల్ల బాబూరావు, అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితరులు హాజరవుతారన్నారు.

22 నుంచి వారణాసికి రైలు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ సత్యవతి

అనకాపల్లి టౌన్: ఉత్తరాంధ్రవాసుల కోరిక మేరకు విశాఖ-వారణాసి రైలు అందుబాటులోకి వస్తోందని ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి తెలిపారు. పలుమార్లు విజ్ఞప్తి చేసిన మీదట రైల్వే మంత్రి సంబల్‌పూర్-వారణాసి-సంబల్‌పూర్ రైలును విశాఖపట్నం వరకు పొడిగించారని చెప్పారు. స్థానిక వివేకానంద చారిటబుల్ ట్రస్టు హాలులో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. విశాఖ - వారణాసి రైలు ఈనెల 22 నుంచి విశాఖ నుంచి బుధ, ఆదివారాల్లో ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నదని చెప్పారు. ఉత్తరాంధ్రతోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రజల కల నెరవేరిందని తెలిపారు. విశాఖ ఉమ్మడి జిల్లాలో గ్రామీణ ప్రాంతాల నుంచి జాతీయ రహదారులను అనుసంధానం చేసే 12 రహదారుల నిర్మాణాలకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు. ఈ రహదారుల్లో 11 రహదారులు పూర్తయ్యాయని, ఏడు రహదారులను ప్రారంభించామన్నారు. జిల్లాలో కాలువలపై వంతెనల నిర్మాణానికి మంజూరైనట్టు చెప్పారు. ఫేస్-2లో మాడుగుల, కశింకోట, మునగపాకలలో ప్రధానమైన మూడు బ్రిడ్జిల నిర్మాణానికి రూ.7 కోట్లు, ఇతర ప్రాంతాల్లో చిన్న వంతెనల నిర్మాణానికి రూ.13.2 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఎన్టీఆర్ క్రీడామైదానంలో రూ.70 లక్షలతో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.40 లక్షలు, ఎంపీ నిధుల నుంచి రూ.30లక్షలతో పనులు చేపట్టినట్టు తెలిపారు. గ్యాలరీల మరమ్మతులు, తాగునీరు, మరుగుదొడ్లకు జీవీఎంసీ నుంచి రూ.16లక్షలు మంజూరైనట్టు చెప్పారు. త్వరలో పనులు ప్రారంభించి డిసెంబర్ నెలాఖరుకు పూర్తి చేస్తామన్నారు. ఈనెల 20న యలమంచిలి నియోజకవర్గం అచ్యుతాపురంలో నిర్వహించే సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్దపీట వేశారన్నారు. కులగణన వల్ల రాష్ట్రానికి ఎంతో మేలు చేకూరుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు

తల్లి చెంతకు చేరిన వేళ..

స్కూలు బస్సు కోసం నిరీక్షిస్తున్న బాలుడు క్షణాల్లో అదృశ్యం కావడంతో ఆ తల్లి తల్లడిల్లిపోయింది. అక్కడే ఎక్కడో ఉంటాడులే అన్న ఆశతో ఎంత వెదికినా కనబడకపోవడంతో కన్నీటిపర్యంతమయ్యింది. గంటలు గడిచిపోతున్నా ఆచూకీ లభించకపోవడంతో ఆమె ఆందోళన తీవ్రతరమయ్యింది. పోలీసుల గాలింపు ఫలితంగా మబ్బులు వీడిపోయినట్టు సమీపంలోని తోటల్లోనే బాలుడు క్షేమంగా లభించడంతో ఆ మాతృమూర్తి ఆనందానికి అవధులు లేవు. రోలుగుంట మండలం గుండుబాడు పంచాయతీ శివారు కొరెడ్డిపాలెం గ్రామంలో ఈ శనివారం ఈ ఘటన జరిగింది.



తల్లి చెంతన బాలుడు జోస్వర్ధన్. పక్కన కొత్తకోట సీఐ ఇలియాస్ మహమ్మద్

- ఐదు గంటలపాటు చిన్నారి అదృశ్యం
- అమ్మ ఏమరపాటుతో క్షణాల్లో మాయం
- చివరకు సమీపంలోని తోటల్లో లభ్యం

రోలుగుంట: కొరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఆరేళ్ల జోస్వర్ధన్ మాకవరపాలెం మండలం బూరుగుపాలెంలో యూకేజీ చదువుతున్నాడు. శనివారం ఉదయం 7 గంటలకు బాబుని తయారు చేసి స్కూలుకు పంపించేందుకు రోడ్డు పక్కన నిలబెట్టి అతని బ్యాగు, క్యారేజీ కోసం తల్లి కొంకి రాజేశ్వరి ఇంటికి వెళ్లింది. తిరిగి వచ్చిన రాజేశ్వరి బాబు అక్కడ లేక పోవడంతో ఆందోళన చెందింది. అరగంట వెతికినా కనిపించకపోవడంతో ఆందోళన చెంది భర్త శ్రీనుతో కలసి రోలుగుంట పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఎస్పీ మురళీకృష్ణ ఆదేశాలతో పోలీసులు పెద్ద సంఖ్యలో రంగంలోకి దిగి గాలించారు. కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ బాలుడు అదృశ్యమైన స్థలానికి వెళ్లి తీవ్రంగా గాలించారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా బాలుడి కదలికలను గుర్తిస్తుండగా.. గ్రామ సమీపంలోని తోటల్లో బాబు ఉన్న సమాచారం అటుగా వెళుతున్న ఒక మహిళ అందజేసింది. దీంతో మధ్యాహ్నం 12 గంటలకు గ్రామ సమీపంలో ఉన్న తోటలో గల పొదల వద్ద పోలీసులు బాబుని గుర్తించారు. తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించారు. కన్నీరుమున్నీరుగా రోదిస్తున్న తల్లిదండ్రులు బాబుని చూసి ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. సీఐ తదితర పోలీసులకు కృతజ్ఞతలు చెప్పారు. బాబుని ఎవరో ఎత్తుకు పోయారని వదంతులు వ్యాపించాయని, అది నిజం కాదని పోలీసులు స్పష్టం చేశారు.

సీసీ కెమెరాలతో ఎంతో ప్రయోజనం

ప్రతి గ్రామం మొదల్లో రెండు సీసీ కెమెరాలు, చివరన రెండు కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాలను నియంత్రించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని సీఐ ఇలియాస్ మహమ్మద్ చెప్పారు. ఏమరపాటుగా ఉండరాదని, పిల్లలను ఒంటరిగా వదిలి పెద్దలు వెళ్లరాదని ఆయన హితవు పలికారు.

20న కుల గణనపై ప్రాంతీయ సదస్సు

మహారాణిపేట (విశాఖ): వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఈ నెల 20న కుల గణనపై ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన స్టేక్ హోల్డర్లతో ఈ సమావేశం జరగనుంది. కులాల వారీగా జనాభా, వారి సామాజిక, విద్య, ఆర్థిక పురోభివృద్ధి తెలుసుకోవడానికి, సముచిత విధాన నిర్ణయాలు చేపట్టడానికి ఈ నెల 27న రాష్ట్రవ్యాప్తంగా సర్వే నిర్వహిస్తున్నారు. సచివాలయ స్థాయిలో మొబైల్ యాప్ ద్వారా ఈ సర్వే చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల అభిప్రాయాలు, సూచనలు, సలహాలు తెలుసుకోవడానికి జిల్లా, ప్రాంతీయ సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందులో భాగంగా ఈ నెల 20న విశాఖలో ఉత్తరాంధ్ర ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తున్నారు.

దేవాలయాల నిర్మాణం వేగవంతం

- దేవదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్

మాకవరపాలెం: ప్రభుత్వం మంజూరు చేసిన దేవాలయాలను త్వరితగతిన పూర్తిచేయాలని దేవదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ ఆదేశించారు. టీటీడీ నిధులతో మండలంలోని శెట్టిపాలెం, తామరం, దాలింపేటలో జరుగుతున్న నూతన దేవాలయాల నిర్మాణ పనులను ఆయన శనివారం పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దేవాలయాల నిర్మాణ పనుల వేగవంతానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం దేవదాయశాఖ డీఈ సైద మాట్లాడుతూ నియోజకవర్గంలో మొదటి విడతగా 89 దేవాలయాల నిర్మాణాలకు ఒక్కో ఆలయానికి రూ.10 లక్షల చొప్పున మంజూరైనట్టు చెప్పారు. ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ చొరవతో రెండో విడతగా మరో 85 దేవాలయాల నిర్మాణాలకు నిధులు మంజూరైనట్టు తెలిపారు. దేవదాయశాఖ కాకినాడ ఎస్ఈ శేఖర్, ఈఈ దుర్గేష్ ఉన్నారు.



నూకాంబికను దర్శించుకుంటున్న సత్యనారాయణ

నూకాంబికను దర్శించుకున్న కమిషనర్

అనకాపల్లిటౌన్: ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెం నూకాంబిక అమ్మవారిని ఎండోమెంట్ కమిషనర్ సత్యనారాయణ శనివారం దర్శించుకున్నారు. సత్యనారాయణకు ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, బాలాలయంలో అమ్మవారిని దర్శనం చేయించారు. ఆలయ పునః నిర్మాణం, ప్రాకారమండపం, మూడు అంతస్తుల రాజగోపురం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు.

క్లుప్తంగా

కొబ్బరిచెట్టుపై నుంచి పడి రైతు మృతి


మృతుడు రాజారావు

కశింకోట: మండలంలో అచ్చెర్ల గ్రామం కొబ్బరిచెట్టుపై నుంచి కిందపడి రైతు మృతి చెందినట్లు ఎస్‌ఐ ఆదినారాయణ రెడ్డి శనివారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. అచ్చెర్ల గ్రామానికి చెందిన నిమ్మదల రాజారావు(58) తన పొలంలో కొబ్బరిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడ్ని కుటుంబ సభ్యులు అనకాపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు కుమారుడు రమేష్‌నాయుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు


నాగమణి

యలమంచిలి(అనకాపల్లి రూరల్): యలమంచిలి పట్టణం రామచంద్రమ్మ కాలనీకి చెందిన బంగారు నాగమణి(24) అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై పాపినాయుడు శనివారం తెలిపారు. ఆమెకు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారని, ఈ నెల 16న రాత్రి 12.30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఆమె తల్లి వడ్డాది లక్ష్మి ఫిర్యాదు చేసిందన్నారు. కేసు దర్యాప్తు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య


బర్మాన్(ఫైల్)

నక్కపల్లి: ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలు కారణంగా పశ్చిమ బంగాకు చెందిన యువకుడు శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం... కాన్‌వర్ణి ప్రాంతానికి చెందిన సనాతన్ బర్దన్ తన సోదరుడితో కలిసి నక్కపల్లిలో ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తూ ఉపమాకలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆరోగ్యం బాగోలేదని తన గదిలో ఉండిపోయాడు. డ్యూటీకి వెళ్లిన సోదరుడు సాయంత్రం వచ్చి చూసేసరికి ఉరేసుకుని విగతజీవిగా కనిపించడంతో బోరుమన్నాడు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విభీషణరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు.

వెలుగులోకి మట్టిలో మాణిక్యాలు


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ


శిక్షణ తరగతుల్లో పాల్గొన్న 400 మంది వలంటీర్లు

- ఆడుదాం.. ఆంధ్ర శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

చోడవరం: క్రీడల్లో మట్టిలో మాణిక్యాలను వెలుగులోకి తెచ్చి మంచి భవిష్యత్ అందించాలన్న ఆశయంతో ఆడుదాం..ఆంధ్ర కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. దీనిలో భాగంగా 15 నుంచి 18 ఏళ్లలోపు క్రీడాకారులను ఎంపిక చేసేందుకు చోడవరం గవర్నమెంటు హైస్కూల్ గ్రౌండ్‌లో శనివారం వలంటీర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో శ్యామ్‌సుందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ మాట్లాడుతూ విద్యార్థులకు, యువతకు విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆడుదాం..ఆంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులను ప్రతీ సచివాలయం నుంచి ఎంపిక చేయాల్సిన బాధ్యత వలంటీర్లపై ఉందన్నారు. వారి పేర్లు, వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఎటువంటి సిఫారసులు లేకుండా పీఈటీల పర్యవేక్షణలో నేరుగా ప్రతిభ కలిగిన క్రీడాకారులను మాత్రమే ఎంపిక చేయాలన్నారు. వారే రానున్న రోజుల్లో రాష్ట్ర కీర్తిప్రతిష్టలను దేశ, ప్రపంచ నలుమూలల విస్తరించే భావి క్రీడాకారులవుతారన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, పీఈటీలు, ఎంపీడీవోలు ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ జొన్నాడ శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ చైతన్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, ప్రోగ్రాం నిర్వాహకుడు పీఈటీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

దాడి కేసులో నలుగురికి రిమాండ్

అనకాపల్లి టౌన్: ఒకరిపై దాడి చేసిన కేసులో నలుగురికి న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు గ్రామీణ సీఐ రవికుమార్ శనివారం తెలిపారు. సీఐ వివరాల ప్రకారం... మండలంలో కూండ్రం గ్రామానికి చెందిన యలమంచిలి రాంబాబుకు కింతాడ రామకృష్ణకు వ్యక్తిగత కక్షలు ఉన్నాయి. ఏప్రిల్ 26న అనకాపల్లి పట్టణంలో భారత్ వే బ్రిడ్జిలో రాత్రి విధులు ముగించుకుని రాంబాబు తన గ్రామానికి మోటారు సైకిల్‌పై వస్తుండగా, గుర్తు తెలియని ఇద్దరు ఇనుపరాడ్లుతో దాడి చేశారు. ఈ ఘటనలో బాధితుడికి కుడిచేయి విరిగిపోయింది. అతడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసి సాంకేతిక పరిజ్ఞానంతో పట్టణంలో విజయరామరాజుపేటకు చెందిన పోలవరపు రాము, అదే ప్రాంతానికి చెందిన ఉప్పాడ ప్రసాద్ అలియాస్ బద్రీ, కూండ్రం గ్రామానికి చెందిన నక్కరాజు కొండలరావు, కింతాడ రామకృష్ణలను గుర్తించి అరెస్టు చేశారు. రాము, బద్రీలకు నక్కరాజు కొండలరావు, కింతాడ రామకృష్ణ డబ్బులిచ్చి దాడి చేయించినట్లు సీఐ చెప్పారు.

వ్యక్తి అదృశ్యంపై ముమ్మర దర్యాప్తు

యలమంచిలి(అనకాపల్లి రూరల్): మండలంలోని పులపర్తి గ్రామానికి చెందిన తాడేల కొండలరావు (50) అదృశ్యం కేసు మిస్టరీని ఛేదించేందుకు యలమంచిలి రూరల్ పోలీసులు ముమ్మర దర్యాప్తు చేస్తున్నారు. తాడేల కొండలరావు అదృశ్యంపై అతని భార్య ఉమ నాలుగు రోజుల కిందట యలమంచిలి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మొదట అదృశ్యమైనట్టు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా పలు అనుమానాలు రేకెత్తడంతో అన్ని కోణాల్లోనూ విచారణ వేగవంతం చేశారు. కుటుంబంలో ఒకరి వ్యవహారశైలి, మొబైల్ ఫోన్ ట్రాకింగ్, కాల్ డేటా తదితర టెక్నాలజీని ఈ కేసులో వినియోగించినట్టు తెలిసింది. అదృశ్యమైన కొండలరావు సజీవంగా ఉన్నాడా ? లేదా అనే కోణంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులకు మరో కోణంలో నివ్వెరపోయే నిజాలు తెలిసినట్టు సమాచారం. ఆదివారం లేదా సోమవారం ఈ మిస్టరీకి తెరదించనున్నట్టు తెలుస్తోంది.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

- 66 కిలోల గంజాయి స్వాధీనం


పోలీసుల అదుపులో నిందితులు

రోలుగుంట: కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ ఆదేశాలతో మండలంలోని పాపంపేట – శరబవరం మార్గంలో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి, 60 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పాపంపేట వద్ద మూడు బస్తాల్లో నింపిన గంజాయిని పట్టణ ప్రాంతాలకు తరలించేందుకు వాహనం కోసం ఎదురు చూస్తుండగా, ఎస్సై సురేష్ తన సిబ్బందితో కలసి శనివారం రాత్రి దాడి చేశారు. వారిని పట్టుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

పంచాయతీల్లో ప్రతి నెలా సమావేశాలు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి

అనకాపల్లి రూరల్ : గ్రామ పంచాయతీల్లో ఇప్పటివరకు 90 రోజులకొకసారి పాలకవర్గ సమావేశాలు నిర్వహిస్తున్నారని, ఇకపై ప్రతి నెలా క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారిణి ఆర్.శిరీషారాణి స్పష్టం చేశారు. జిల్లాలో ఈవోపీఆర్డీలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అనకాపల్లి మండల పరిషత్ సమావేశమందిరంలో గ్రామ పంచాయతీల్లో సాధారణ పరిపాలనకు సంబంధించి ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలు విషయాలు తెలియజేశారు. కీలకమైన రికార్డుల నిర్వహణపై నిర్లక్ష్యం చూపవద్దని చెప్పారు. అన్ని రికార్డులను సక్రమంగా ఎలా నిర్వహించాలో వివరించారు. గ్రామాల్లో ఆస్తి పన్ను సహా అన్ని రకాల పన్నులను ఏటా 100 శాతం వసూలు చేయాలని, తద్వారా పంచాయతీలకు ఆదాయం పెరుగుతుందన్నారు. ఆర్థిక వనరులు పెంచుకుంటే గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన సులభతరమవుతుందన్నారు. వార్షిక బడ్జెట్‌కు అనుగుణంగా ఖర్చు ఉండాలని సూచించారు. డీఎల్‌పీవో ఎస్.ఎస్.ఎన్.మూర్తి, టీవోటీ కరుణాకర్, అనకాపల్లి ఎంపీడీవో కె.వి.నరసింహరావు, ఏవో కుమార్ పాల్గొన్నారు.

టీడీపీకి గిరి కుటుంబాల షాక్


బొర్రచింతకు చెందిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

- వైఎస్సార్‌సీపీలో చేరిన 9 కుటుంబాలు

దేవరాపల్లి: మండలంలో వాలాబు పంచాయతీ శివారు బొర్రచింతకు చెందిన తొమ్మిది కుటుంబాల వారు టీడీపీకి షాక్ ఇచ్చారు. శనివారం తారువ క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో సుకూరు గణేశ్, ఎరకన్నదొర, వోలం దేవరాజు, మామిడి మల్లేష్, జగదీష్, భీమరాజు, లక్ష్మణరావు, దిప్పాల పోతురాజు, దేముడు ఉన్నారు. తామంతా డిప్యూటీ సీఎం నాయకత్వంలో పనిచేస్తూ.. భవిష్యత్తుకు బాటలు వేస్తున్న వైఎస్సార్‌సీపీ అడుగు జాడల్లో నడుస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, జెడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, యువజన విభాగం మండలాధ్యక్షుడు కర్రి సూరినాయుడు, వాలాబు నాయకుడు పోడెల నానిబాబు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కత్తి సాము పోటీల్లో ప్రతిభ

- కశింకోట విద్యార్థి చందురాజుకు కాంస్య పతకం


ప్రశంసాపత్రాలు మెడల్‌తో విద్యార్థి చందురాజు

కశింకోట: రాష్ట్ర స్థాయి కత్తి సాము పోటీల్లో కశింకోటలోని డీపీఎన్ జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థి తన ప్రతిభను ప్రదర్శించి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి మూడు రోజులపాటు నంద్యాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కత్తి సాము పోటీలో అండర్ – 17 విభాగంలో కాంస్య పతకం, ప్రశంసా పత్రాలను పొందాడు. ఈ సందర్భంగా స్కూలు పీడీ వి. ప్రభాకరరావు, విద్యా కమిటీ చైర్మన్ మేరీ సుజాత, ఉపాధ్యాయులు రామారావు, అప్పారావు, శర్మ, ఆచంట రవి, ప్రసాద్, సునీత తదితరులు శనివారం అభినందించారు.

జాతీయస్థాయి పోటీలకు వేములపూడి విద్యార్థినులు


ఎంపికైన విద్యార్థినులు

నర్సీపట్నం: మండలంలోని వేములపూడి పీఎంశ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినులు జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థినులు జి.నీలా, జే.దీపిక మంచి ప్రతిభ కనబరిచారు. వీరిని జాతీయ స్థాయి పోటీలకు తీర్చిదిద్దిన ఫిజికల్ డైరెక్టర్లు రవి, సుమన్‌లను హెచ్‌ఎం రామకృష్ణారావు, ఉపాధ్యాయులు శనివారం అభినందించారు.

దత్తత గ్రామాలను సందర్శించాలి

- పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయండి
- రివ్యూ మీటింగ్‌లో ఎస్పీ మురళీకృష్ణ ఆదేశం


మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ


ఎ.కోడూరు ఎస్‌ఐ రామకృష్ణకు సర్టిఫికెట్‌ను అందిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్: జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో దత్తత గ్రామాలను కానిస్టేబుళ్లు సందర్శించాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశించారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో శనివారం నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సంఘటనలకు సంబంధించి ముందస్తు సమాచారం సేకరించి స్థానిక ఎస్‌హెచ్‌వోలకు తెలియజేయస్తూ గొడవలు, వర్గవిభేదాలు, రాజకీయ సంఘర్షణలు, అసాంఘిక కార్యకలాపాలకు తావ్వికుండా చూడాలన్నారు. దర్యాప్తులో సాధారణ, ప్రాపర్టీ, పోక్సో, 174 సీఆర్పీసీ, గంజాయి, మిస్సింగ్ కేసులను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సమీక్షించారు. ఆయా కేసుల్లో దర్యాప్తు పెండింగ్‌లో ఉండటానికి గల కారణాలను పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పూర్తి చేయాలని పలు సూచనలు చేశారు. మిస్సింగ్ కేసులు, గుర్తుతెలియని మృతుల కేసులను త్వరితగతిన దర్యాప్తు చేసేందుకు డీసీఆర్బీ, ఎస్‌సీఆర్బీల్లో కేసులతో సరి చూసుకొని ముఖ్య కూడళ్లు, రైల్వే, బస్సు స్టేషన్లో మిస్సింగ్ వ్యక్తి, అన్ ఐడెంటిఫైడ్ డెడ్‌బాడీ ఫొటోస్, వారి వివరాలతో పోస్టర్లు అతికించి ట్రేస్ చేయాలన్నారు. స్పెషల్ టీంలను ఏర్పాటు చేసి పెండింగ్ నాన్ బెయిలబుల్ వారంట్లను ఎగ్జిక్యూట్ చేయడం ద్వారా నిందితులు ఇతర నేరాలకు పాల్పడకుండా అరికట్టవచ్చన్నారు. గంజాయి, ఇతర ముఖ్యమైన కేసుల్లో నిందితులపై త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో శిక్షలు పడేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన 24 మంది అధికారులకు, సిబ్బందికి ప్రశంసాపత్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.విజయభాస్కర్, పి.సత్యనారాయణరావు, అసిస్టెంట్ కలెక్టర్ స్మరణరాజ్, డీఎస్పీలు వి.సుబ్బరాజు, పి.శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ట్రైనీ డీఎస్పీ బి.భాగ్యరెడ్డి, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, పైడపునాయుడు, అప్పలనాయుడు, సతీష్, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

21న మినీ జాబ్‌మేళా

అనకాపల్లిటౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 21న అచ్యుతాపురం ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు సంస్థ జిల్లా అధికారి టి.చాముండేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరవాడ రిఫ్రా టెక్నిక్ కంపెనీలో ఉద్యోగాల భర్తీకి జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు చెప్పారు. ఐటీఐ(ఫిట్టర్, వెల్డర్, మెకానికల్, ఎలక్ట్రికల్) విద్యార్హత గల, 18 నుంచి 25 సంవత్సరాల లోపు వయస్సుగల యువతీ, యువకులు అర్హులని, మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 7036363272లో సంప్రదించాలని ఆయన కోరారు.

అగ్ని బాధితుడికి ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు

కశింకోట: అగ్నిప్రమాదంలో దగ్ధమైన వస్త్ర దుకాణం యజమానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు ఆర్థికసాయం అందజేశారు. విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా స్థానిక రెల్లి వీధిలో ఈ నెల 15న జరిగిన అగ్ని ప్రమాదంలో పుచ్చల రెడీమెడ్ దుకాణం దగ్ధమై సుమారు రూ.15 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో దుకాణాన్ని బుల్లిబాబు శనివారం సందర్శించి అగ్ని ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకొని, దుకాణ యజమాని పుచ్చల ఈశ్వరరావును ఓదార్చారు. రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందించి అండగా నిలిచారు.

ఓటు విలువ తెలుసుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లిటౌన్: ఓటు విలువను అందరూ తెలుసుకోవాలని ఆర్డీవో జి.చిన్నికృష్ణ తెలిపారు. స్థానిక శేఖర్ డిగ్రీ కళాశాలలో శనివారం ఓటు ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మాట్లాడుతూ విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని, అర్హులందరూ ఓటర్లుగా నమోదు కావాలని సూచించారు. అనంతరం పలువురు విద్యార్థులు ఓటు హక్కు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 2,242 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	3,670	4,260
రెండో రకం	3,530	4,050
మూడోరకం	3,300	3,640

అనకాపల్లి సినిమాలు

మై నేమ్ ఈజ్ శృతి	: రాజా
మా ఊరి పొలిమేర-2	: సత్యనారాయణస్క్రీన్-1
స్పార్క్	: సత్యనారాయణస్క్రీన్-2
జిగర్‌తండ	: షిర్డిసాయి
కీడా కోలా	: పర్తిసాయి
-------	: వెంకటేశ్వర
టైగర్-3	: శ్రీసత్య
మంగళవారం	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 13 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-3 యూనిట్లు, బి పాజిటివ్-2 యూనిట్లు, బి నెగిటివ్-1 యూనిట్, ఒ పాజిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 359 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 331 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

బొజ్జన్న కొండ రోడ్డుకు మోక్షం

- రూ.1.5 కోట్లతో రహదారి నిర్మాణం
- మొదటి దశ పనులు పూర్తి



పూర్తయిన బొజ్జన్నకొండ మొదటి దశ రోడ్డు

తుమ్మపాల: కొన్నేళ్లగా శిథిలావస్థలో ఉన్న బొజ్జన్న కొండ రోడ్డుకు మోక్షం లభించింది. నూతన జిల్లా ఏర్పాటుతో బొజ్జన్నకొండను అభివృద్ధి చేసి, పర్యాటకులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కార్తీకమాసంలో వన సమారాధనలో భాగంగా అత్యధికంగా పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. ప్రతి ఏటా కనుమ రోజున బౌద్ధభిక్షువులతో మహా బౌద్ధమేళాను ఇక్కడ ప్రత్యేకంగా నిర్వహిస్తారు. ఇంతటి ప్రాచుర్యం కలిగిన ఈ ప్రాంతానికి చేరుకోవాలంటే సరైన రహదారి లేక సందర్శకులు తిప్పలు పడుతున్నారు. ఇక నుంచి అటువంటి సమస్యలు లేకుండా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఎంపీ కోటా నిధులతో పాటు కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీలో భాగంగా పలు పరిశ్రమల సహకారంతో రూ.1.5 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

మొదటి దశ పనులు పూర్తి

మూడు నెలల క్రితం ప్రారంభించిన మొదటి దశ బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయింది. మిగిలిన పనులు త్వరలో పూర్తిచేసేందుకు అధికారులు సమాయత్తమయ్యారు. శంకరం ఏలేరు కాలువ జంక్షన్ నుంచి బొజ్జన్నకొండ వరకు తుమ్మపాల రోడ్డును కలుపుతూ 1,050 మీటర్ల పొడవు గల రోడ్డును నిర్మించనున్నారు. ఈ మొత్తం రోడ్డు నిర్మాణానికి రూ.1.5కోట్లు వ్యయం అతుందని అంచనా వేశారు. ఈ మొత్తంలో ఎంపీ భీశెట్టి వెంకటసత్యవతి కోటా నిధుల నుంచి రూ.40 లక్షలు విడుదల చేశారు. మిగిలిన నిధులు సమకూర్చేందుకు కలెక్టర్ దృష్టి సారించారు. సీఎస్ఆర్ నిధులు సేకరించేందుకు చర్యలు చేపట్టారు. మొదటి దశ పూర్తవగా మిగిలిన రోడ్డు రానున్న మూడు నెలల్లో పూర్తిచేసేందుకు అధికార యంత్రంగం సిద్ధమైంది. 15 ఏళ్ల కిందట అనకాపల్లి- సబ్బవరం రోడ్డును అనుకుని బొజ్జనకొండకు రోడ్డు వేశారు. ఆ రోడ్డును ఇప్పుడు అభివృద్ధి చేస్తున్నారు. అనకాపల్లి- సబ్బవరం రోడ్డు జాతీయ రహదారిగా మారడంతో బొజ్జన్నకొండకు రవాణా సదుపాయం మరింత మెరుగుపడుతుంది.

వాకింగ్ ట్రాక్‌తో రోడ్డు నిర్మాణం



జాతీయ రహదారి నుంచి బొజ్జన్నకొండ వద్ద గ్రీనరీ ఏర్పాటు చేయడంతో పాటు వాకింగ్‌ట్రాక్‌తో రోడ్డు నిర్మాణం చేపడుతున్నాం. పనులు వేగంగా జరుగుతున్నాయి. మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్ సహకారంతో త్వరలో రోడ్డు పనులు పూర్తవుతాయి. పర్యాటక ప్రాంతంగా బొజ్జన్న కొండ మరింత అభివృద్ధి చెందేలా కృషి చేస్తున్నాం.

– ఎంపీ భీశెట్టి వెంకటసత్యవతి, అనకాపల్లి

వైద్యాలయం తనిఖీ



వైద్యాధికారులకు సూచనలిస్తున్న రామ్మూర్తి

అనకాపల్లిటౌన్: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయాన్ని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి శనివారం తనిఖీ చేశారు. నూతనంగా ప్రారంభించిన ల్యాబ్‌తోపాటు సిటీస్కాన్ కోసం తయారవుతున్న గదిని పరిశీలించారు. అత్యవసర విభాగంతోపాటు క్యాజువాల్టీని పర్యవేక్షించి వైద్యాధికారులు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు మునూరు శ్రీను, ఏపీ.రత్నకుమారి, పీలా శ్రీనివాస్, ఉగ్గిన అప్పారావు పాల్గొన్నారు.

సనాతన రుషి సంస్కృతిని కాపాడుకోవాలి

అచ్యుతాపురం(అనకాపల్లి): భారతదేశ సనాతన రుషి సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని శ్రీఅష్టలక్ష్మి పీఠం శ్రీ రఘునాథ అచార్య స్వామి అన్నారు. అచ్యుతాపురంలో శనివారం నిర్వహించిన హిందూ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు.సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. పోలీస్ గ్రౌండ్‌లో నిర్వహించిన సమ్మేళనంలో రఘునాథ ఆచార్య మాట్లాడుతూ రామనామం గొప్పతనాన్ని వివరించారు. ఈ సందర్భంగా భజనలు, కోలాటాలు ఆకట్టుకున్నాయి.

నిర్విఘ్నంగా భిక్ష కార్యక్రమం

మునగపాక : స్థానిక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న భిక్ష కార్యక్రమం శనివారం నాటికి 25వ రోజుకు చేరుకుంది. గత నెల అక్టోబర్ 25న ప్రారంభించిన భిక్ష భక్తుల విరాళాలతో నిర్విరామంగా కొనసాగుతుంది. అయ్యప్ప మాలలు ధరించే భక్తులతో పాటు ఇతర మాలలు ధరించిన భక్తులు కూడా ఈ భిక్షను సద్వినియోగం చేసుకుంటున్నారు. 50 రోజుల పాటు భిక్ష సదుపాయాన్ని అందరి సహకారంతో నిర్వహించేలా ఆలయ కమిటీ సభ్యులు నిర్ణయం తీసుకున్నారు.

మంత్రి చొరవతో ఎస్టీ కులధ్రువీకరణ పత్రం జారీ



మూర్తికి ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం గ్రామానికి చెందిన ఓ కుటుంబానికి సుమారు నాలుగు దశాబ్దాల తర్వాత రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చొరవతో ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం శనివారం లభించింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. తాళ్లపాలెంలో నాలుగు దశాబ్దాలుగా నివాసం ఉంటున్న సంచార జాతులకు చెందిన ఇందేటి మూర్తి కుటుంబానికి కుల ధ్రువీకరణ పత్రం లేదు. ఎన్నిసార్లు అధికారులకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇక్కడ వారి కులం లేదని ధ్రువీకరణ పత్రాన్ని ఇప్పటి వరకు జారీ చేయలేదు. దీంతో మూర్తి కుమారుడైన 21 ఏళ్ల శ్రీనుకు దివ్యాంగుడైనప్పటికీ అర్హత ఉండి వికలాంగ పింఛన్ పొందే అవకాశం లేని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్ దృష్టికి బాధితుడు తీసుకురావడంతో ఈ విషయాన్ని వారు మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు తెలియజేశారు. వెంటనే స్పందించిన మంత్రి కుల ధ్రువీకరణ పత్రం జారీకి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈనేపథ్యంలో మూర్తి కుటుంబ సభ్యులకు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రంతోపాటు కుమారుడు శ్రీనుకు దివ్యాంగ ధ్రువీకరణ పత్రాన్ని కూడా అధికారులు మంజూరు చేసి, శనివారం అందజేశారు. దీంతో మంత్రి అమర్‌నాథ్‌కు మూర్తి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

భూ సర్వే త్వరగా పూర్తి చేయండి

- పనిచేయలేని అధికారులు సెలవు పెట్టండి
- మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కన్నబాబు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలో భూ సర్వేను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబా బు) సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శని వారం ఎంపీపీ కోన సంధ్య అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. అచ్యుతాపురంలో గంజాయి విచ్చలవిడిగా దొరుకుతుందని, దానిని నివారించడానికి సంబంధిత శాఖ చర్యలు తీసుకోవాలని కోరారు. జగనన్న సురక్షలో భాగంగా అందరికీ అవరమైన ధ్రువీకరణ పత్రాలను ఇవ్వగలిగామని, జగనన్న ఆరోగ్య సురక్షలో 28 వేల మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారని వివరించారు. ఈ సందర్భంగా మల్లవరం సర్పంచ్ పిన్నమరాజు వాసు, మడుతూరు సర్పంచ్ మోటూరు సంజీవి పలు అంశాలపై అధికారులను ప్రశ్నించారు.

పూడిమడక సర్పంచ్ చేపల సుహాసిని తమ గ్రామానికి అవసరమైన వనరుల గురించి అడిగారు. దొప్పెర్ల సర్పంచ్ చిన్నారావు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి అందుబాటులో ఉండని కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొనగా, నా లుగు పంచాయతీలు చూస్తున్న సద రు కార్యదర్శిని రెండు పంచాయతీలకు పరిమితం చేసి, మరొకరికి బాధ్యతలు అప్పగించాలని అధికారులకు సూచించారు. ఎంపీడీవో, వ్యవసాయ శాఖ అధికారిపై ఎమ్మెల్యే మండిపడ్డారు. జెడ్పీ టీసీ లాలం రాంబాబు, ఎంపీడీవో విజయలక్ష్మి, కోఆప్షన్ జెడ్పీటీసీ న ర్మాల కుమార్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల అధికారులు పాల్గొన్నారు.

కల్యాణ మండప నిర్మాణ పనుల పరిశీలన



కల్యాణ మండపం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు

కశింకోట: స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట అరబిందో ఫార్మాసిటీ పరిశ్రమ సహకారంతో నిర్మిస్తున్న కల్యాణ మండపం పనులు చురుగ్గా సాగుతున్నాయి. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రోత్సాహంతో సుమారు రూ.కోటితో దీన్ని నిర్మిస్తున్నారు. దీన్ని త్వరితగతిన పూర్తి చేసి, మంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి ఎస్. రమేష్, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న రత్నాకర్

అనకాపల్లిటౌన్: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని కోట్నివీధి వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బందికి వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ సూచించారు. శనివారం ఆయన ఆ హెల్త్ సెంటర్‌ను సందర్శించి, రోగులతో మాట్లాడారు. ఆస్పత్రిలో సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను కోరారు. అంతకుముందు 83, 84వ వార్డుల పరిధిలో 9, 10 సచివాలయాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు కోరుకొండ రాఘవ, గాడి మధురీనాయుడు, కోటిపల్లి జీజీ బాబు, కొట్ని శ్రీనివాసరావు, కటారి దేముడు, కోడూరు త్రినాథ్, ఆడారి రవికుమార్, కోటిపల్లి శ్రీను, పలకా కాసులు, సూరిశెట్టి వికాష్, సయ్యద్ నగూర్, ఉమ్మిన పైడిరాజు, రేబాక ఇంద్రకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వివిధ పోటీలు



బాలికోన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు



క్విజ్ పోటీల నిర్వహణ ప్రశ్నపత్రం విడుదల చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు



తాళ్లపాలెం గ్రంథాలయంలో తెలుగు పండిట్లకు సత్కారం

అనకాపల్లిటౌన్: గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలో పలు పాఠశాలల్లో శనివారం స్థానిక శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్, వక్తృత్వ, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. వేల్పులవీధి బాలికోన్నతపాఠశాల విద్యార్థులకు ఝాన్సీలక్ష్మీభాయి చరిత్రపై వ్యాసరచన, జీవీఎంసీ పట్టణ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, క్విజ్, డిబేట్, చిన్నవీధి జీవీఎంసీ జార్జి పాఠశాల విద్యార్థులకు క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 80 మంది విద్యార్థులు పాల్గొనగా 36 మంది విజేతలుగా నిలిచినట్టు గ్రంథాలయ అధికారి కె.శ్రీనివాసరావు చెప్పారు. ఈనెల 20న బహుమతి ప్రధానం చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సమన్వయకర్త బల్లా నాగభూషణం, బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం కె.రుధిరారాణి, పట్టణ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం హసీనా బేగం, జార్జిపాఠశాల హెచ్‌ఎం మాధవి తదితరులు పాల్గొన్నారు.

కశింకోటలో క్విజ్ పోటీలు

కశింకోట: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు శనివారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పది జట్లకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ముందుగా క్విజ్ పోటీల ప్రశ్న పత్రాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు విడుదల చేశారు. డీపీఎన్ హైస్కూలు హెచ్‌ఎం ఎం.ఆర్.వి.అప్పారావు, బాలికల హైస్కూలు విద్యా కమిటీ చైర్మన్ యల్లపు శ్రీనివాసరావు, కోదండ సీతారామచంద్ర మూర్తి స్వామి ఆలయ మాజీ చైర్మన్ శిష్టి అప్పారావు, రిటైర్డు ఉపాధ్యాయుడు యల్లపు రామచంద్రరావు, వివేకానంద స్కూలు ఉపాధ్యాయురాలు సంగీత లక్ష్మి, గ్రంథాలయ అధికారి కె. వరలక్ష్మి, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కవిసమ్మేళనం

తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో కవి సమ్మేళనం నిర్వహించారు. తెలుగు పండిట్లు నండూరి ప్రసన్న, ఎ. విజయదుర్గ, కె. నాగరత్నం, ఎస్. పార్వతి, బి. వెంకటలక్ష్మి, కె. మహాలక్ష్మినాయుడు పాల్గొని కవి సమేశ నం జరిపారు. వీరిని జ్ఞాపికలతో సత్కరించారు. అనంతరం విద్యార్థులకు జూనియర్, సీనియర్ విభాగాల్లో వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి కె. జగన్నాథం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీల విజేత వాడ్రాపల్లి జట్టు



కబడ్డీ పోటీలో విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

కశింకోట: జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో మునగపాక మండలం వాడ్రాపల్లి జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. నాగుల చవితిని పురస్కరించుకుని స్థానిక కనకమహాలక్ష్మి వీధిలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు రసవత్తరంగా శుక్రవారం రాత్రి జరిగాయి. ఫైనల్ పోటీల్లో వాడ్రాపల్లి, కశింకోట దుర్గమాంబ జట్లు తలపడ్డాయి. వాడ్రాపల్లి ప్రథమ స్థానంలో నిలవగా, దుర్గమాంబ జట్టు ద్వితీయ స్థానం పొందింది. బుచ్చియ్యపేట మండలం రాజాం జట్టుకు తృతీయ స్థానం లభించింది. ఈ మేరకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ. 8,116, 4,116, 2,116 చొప్పున అందజేశారు. కనకమహాలక్ష్మి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు భీశెట్టి కుమార్, ఉపాధ్యక్షుడు వేగి సన్యాసినాయుడు, కోశాధికారి ఆళ్ల శ్రీను ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, కృష్ణం రాజు కాలువ మాజీ డైరెక్టర్ మళ్ల లోవకృష్ణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దాడి నాగరాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు కోయిలాడ నాగు, స్థానికులు వేగి పవన్, చదరం వెంకటరావు, దాడి రాము, ఆడారి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం



మందులు అందజేస్తున్న వైద్యాధికారి లావణ్య

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెంలో అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు, వారి తల్లిదండ్రులను ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి కె.లావణ్య పరీక్షించి, ఉచితంగా మందులు అందజేశారు. ఆరోగ్య పరిరక్షణకు పలు సూచనలు చేశారు. ఆరోగ్యానికి ఉపయోగపడే యోగా, ధ్యానం పట్ల అవగాహన కలిగించారు.

'ఆడుదాం ఆంధ్ర'పై వలంటీర్లకు శిక్షణ



గ్రామ వలంటీర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కశింకోట: 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంపై మండలంలోని గ్రామ వలంటీర్లకు స్థానిక బాలికల హైస్కూలు, డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వాలీబాల్, షటిల్, క్రికెట్, కబడ్డీ, ఖో-ఖో తదితర ఆటల నిర్వహణపై హైస్కూళ్ల వ్యాయామ ఉపాధ్యాయులు అవగాహన కలిగించారు. విద్యార్థులతో ఆయా ఆటలు ఆడించి, వాటి నియమ నిబంధనలను ప్రాక్టికల్‌గా వివరించారు. ప్రభుత్వం వచ్చే నెల నుంచి నిర్వహించనున్న ఆడుదాం అంధ్ర కార్యక్రమంలో గ్రామ వలంటీర్లు భాగస్వాములు కానున్న నేపథ్యంలో ఆటలపై అవగాహనకు సుమారు 200 మంది వలంటీర్ల ఈ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి మండల కో-ఆర్డినేటర్‌గా పెంటకోట కమల వ్యవహరించారు. ఎంపీడీవో వి.వి.రవికుమార్, ఎంఈవోలు చిట్టిబాబు, మూర్తి తదితరులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పీడీలు వి.ప్రభాకరరావు, జి. గోవిందరావు, ఎం.ఎస్.ఎం.డి. బషీరుద్దీన్, జి. కృష్ణమూర్తి, పి.సుకురమ్మ, పి. సంతోష్‌కుమారి, పీఈటీ కె.నాగమణి, జి. నూకరాజు, పీహెచ్. ధనలక్ష్మి, ఎస్. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.





ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం – దేవాదాయ ధర్మాదాయ శాఖ
శ్రీశ్రీశ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానం
గవరపాలెం, అనకాపల్లి పట్టణం, అనకాపల్లి జిల్లా – 531002
Cell : 9491000713

ఇ-ప్రొక్యూర్‌మెంట్ మరియు టెండర్ - కం - బహిరంగ వేలం ప్రకటన

ఆర్.సి.నెం. 139/2023 తేది : 18-11-2023

ఈ క్రింది విషయములు గూర్చి టెండర్ కం బహిరంగ వేలం తే : 02-12-2023ది శనివారం నాడు నిర్వహించబడును.

క్రమ సంఖ్య	వివరము	ప్రథమ ధరావత్తు మొత్తము రూ॥	కాలపరిమితి
1.	రసవర్గములు (సరఫరా) కొరకు	రూ.2,00,000/-	తే.1.1.2024ది నుండి తే 30.06.2024 వరకు (6 నెలల కాలపరిమితికి)
2.	శ్రీ అమ్మవార్కి భక్తులచే సమర్పించబడి వదిలివేసిన వస్త్రములు (అనగా చీరలు, రవికలగుడ్డలు) తీసుకొనే హక్కునకు	రూ.8,00,000/-	తే. 1.1.2024 ది నుండి తే. 31.12.2024 వరకు (ఒక సంవత్సరం కాలపరిమితికి)
3.	కొబ్బరి చెక్కలు ప్రోగుచేసుకొనే హక్కునకు	రూ.4,00,000/-	
4.	శ్రీ అమ్మవారికి భక్తులు సమర్పించగా వచ్చిన తలనీలాలు తీసుకొనే హక్కు తే.01.07.2023 నుండి వచ్చిన తలనీలాలతో కలిపి	రూ.1,00,000/-	
5.	శ్రీ అమ్మవారికి భక్తులచే సమర్పించి వదిలి వేయబడిన పప్పులు, గాజులు వగైరాలు తీసుకొనే హక్కునకు	రూ.1,00,000/-	
	(టెండర్ - కం - కొటేషన్ ద్వారా)		
6.	శ్రీ అమ్మవారి ఫోటోలు, డాలర్లు వగైరాలు సరఫరా కొరకు	రూ.10,000/-	తే.1.1.2024 ది నుండి తే.31.12.2024 వరకు (ఒక సంవత్సరం కాలపరిమితికి)
7.	ఖాళీ డబ్బాలు, గోనె సంచులు తీసుకొనే హక్కునకు	రూ.10,000/-	
8.	కండువాలు, రవికలు, వస్త్రములు సరఫరా కొరకు	రూ.10,000/-	
9.	షామియానాలు, కుర్చీలు వగైరాలు (అద్దెకు) (సరఫరా)	రూ.10,000/-	
10.	పువ్వులు, పూలదండలు / పుష్పాలంకరణ వగైరా (సరఫరా)	రూ.10,000/-	
11.	స్టేషనరి సప్లై చేయుటకు	రూ.10,000/-	
12.	ఎలక్ట్రికల్ గూడ్స్ సప్లై చేయుటకు	రూ.10,000/-	
13.	పైపులైన్లు సామాగ్రి సప్లై చేయుటకు	రూ.10,000/-	
14.	కంప్యూటర్ మరియు సి.సి.టీవీల నిర్వహణ కొరకు	రూ.10,000/-	
15.	శానిటరీ సామగ్రి సరఫరా చేయుటకు	రూ.10,000/-	
16.	కూరగాయలు సరఫరా చేయుటకు	రూ.10,000/-	
17.	పనికిరాని పాత ఇనుము మరియు పాత కలప, ఇతర పాత వస్తువులు ఉన్నది ఉన్నట్లు తీసుకొనే హక్కునకు	రూ.10,000/-	

1. పై లైసెన్సు 1 నుండి 5 వ హక్కులకు **ఇప్రోక్యూర్‌మెంట్ ద్వారా ఇ బిడ్స్ కోరబడుచున్నవి.** లైసెన్సు హక్కులు షెడ్యూల్ కొరకు. www.eprocurement.gov.in ద్వారా లాగిన్ apendowmentsmarketing నందు తే 18-11-2023 సాయంత్రం గం. 8.00ల నుండి తే.30-11-2023ది. సాయంత్రం గం. 3.00ల వరకు బిడ్ సమర్పించవచ్చును. టెక్నికల్ బిడ్ తేది 1-12-2023, ప్రైస్ బిడ్ 2-12-2023 ఉదయం గం. 08.00 ల నుండి తెరువబడును.
2. పై లైసెన్సు 1 నుండి 17 వరకు హక్కులకు పేపరు టెండరు దాఖలా చేయువారు ధరావత్తు డి.డి రూపమున చెల్లించి దేవస్థాన కార్యాలయము నందు తేది : 21-11-2023 నుండి తేది : 1-12-2023 వరకు టెండర్ షెడ్యూల్ పొందవచ్చును. పూర్తి చేసిన సీల్డు టెండర్లు దేవస్థానము వారు ఏర్పాటు చేసిన బాక్స్ నందు తేది : 2-12-2023 దిన బహిరంగ వేలము పాటకు ముందు ఉదయం గం. 10.00 లోపు వేయవలెను. షెడ్యూలు ఖరీదు రూ. 1000/-.
3. 2వ నుండి 5 వరకు హక్కుకు టెండరు కం బహిరంగ వేలము నందు పాల్గొను పాటదారుడు వారి యొక్క సాల్వెన్సీ సర్టిఫికేట్, పాన్ పోర్టు సైజు ఫోటో మరియు ఐ.డి. మరియు అడ్రసు ప్రూఫ్‌గా పాన్ కార్డు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు జెరాక్స్‌ను పాట ప్రారంభమునకు ముందుగా అధికారులకు చూపించి జెరాక్స్ లను అధికారులకు ఇవ్వవలెను. అట్లు లేని యెడల వారి వద్ద నుండి ధరావత్తు స్వీకరించబడదు. కాపీ తప్పనిసరిగా జతపర్చవలెను.
4. దేవాలయం పునర్నిర్మాణం పనులు జరుగుచున్న నందర్భంగా పాట తేదికి ఉన్న పరిస్థితులు బట్టి అవసరమైన కొన్ని షరతులు విధించుటకున్నూ తగు మార్పులు చేయుటకున్నూ, ఏకారణము చేతనైనను పై జాబితా నందు పాటలను రద్దు పరచుటకు / వాయిదా వేయుటకు దేవస్థానము కార్యనిర్వహణాధికారి వారికి అధికారము కలదు. ఇతర షరతులు, వివరములు కార్యాలయము పనివేళల యందు తెలుసుకొనవలెను. ఫోన్ నెం. 08924-226823, 9491000713.

శ్రీ అమ్మవారి దేవస్థానం పునః నిర్మాణం నిమిత్తం విరాళములు ఇచ్చు దాతలు పై బార్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా సమర్పించవచ్చును. సదరు వివరములను 9491000713 కి WhatsApp ద్వారా తెలియపరచగలరు.

శ్రీ కొణతాల మురళీకృష్ణ, చైర్మన్ | సం/- బందారు ప్రసాద్, సహాయ కమిషనరు & కార్యనిర్వహణాధికారి

ధర్మకర్తలు

శ్రీ బుద్ద నరసింగరావు, శ్రీమతి పీలా లక్ష్మి శ్రీనివాసురావు, శ్రీమతి ఆడారి ఉమా శ్రీనివాసరావు, శ్రీ గొల్లవిల్లి నరసింగరావు, శ్రీ కొండూరు రవీంద్రనాథ్, శ్రీమతి పాము అనూరాధ నన్నిబాబు, శ్రీమతి కంటపల్లి శోభారాణి వెంకట్రావు, శ్రీ మల్లవరపు ఈశ్వరరావు, శ్రీ వై.శ్రీనివాసు (ఎక్స్ అఫీషియో మెంబర్)